APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ శనివారం 08 ఆగస్టు 2026 సంపుటి: 01 సంచిక :72 పేజీలు : 04 వెల: 2-00/-



# చేనేతకు రాష్ట్రపతి ప్రశంసలు


- జాతీయ చేనేత పురస్కారాల ప్రదానం
- రాష్ట్రపతి భవన్‌లో ఘన వేడుకలు
- చేనేత వారసత్వాన్ని కొనియాడిన ద్రౌపది ముర్ము

న్యూఢిల్లీ, ఆగస్టు 7 : 12వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు రాష్ట్రపతి భవన్ సాంస్కృతిక కేంద్రంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరై సంత్ కబీర్ చేనేత పురస్కారాలు, జాతీయ చేనేత పురస్కారాలు--2025 విజేతలకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ భారత నాగరికత పరిణామ క్రమంలో చేనేతకు శతాబ్దాల చరిత్ర ఉందని పేర్కొన్నారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలు, ప్రాంతీయ ప్రత్యేకతలను ప్రతిబింబించే గొప్ప వారసత్వంగా చేనేత రంగం నిలిచిందన్నారు. భారతదేశంలోని విభిన్న ప్రాంతాల కళాత్మక నైపుణ్యాన్ని చేనేత ఉత్పత్తులు ప్రపంచానికి పరిచయం చేస్తున్నాయని రాష్ట్రపతి తెలిపారు. ప్రతి ప్రాంతానికి ప్రత్యేకమైన నేసిన వస్త్రాలు భారత వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు. సంప్రదాయ చేనేత కళలను ఆధునిక రూపకల్పనలతో అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమర్థవంతమైన బ్రాండింగ్, అంతర్జాతీయ మార్కెట్ అనుసంధానం ద్వారా చేనేత ఉత్పత్తులకు మరింత విస్తృత అవకాశాలు లభిస్తాయని అభిప్రాయపడ్డారు. యువ పారిశ్రామికవేత్తలు, రూపకర్తలు, నవ్య ఆలోచనలతో ముందుకొచ్చే సంస్థలు చేనేత రంగంలో కొత్త అవకాశాలను సృష్టించగలవని రాష్ట్రపతి సూచించారు. సాంప్రదాయ నైపుణ్యాన్ని ఆధునిక మార్కెట్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దితే భారత చేనేత ప్రపంచవ్యాప్తంగా మరింత గుర్తింపు పొందుతుందన్నారు.

# మద్యం మత్తు ఘాతుకంపై సీఎం ఆగ్రహం

అమరావతి, ఆగస్టు 7 : రాజమహేంద్రవరంలో మద్యం మత్తులో కారు నడుపుతూ పీజీ వైద్య విద్యార్థులపై దాడి చేసి డాక్టర్ ప్రియాంక బ్రెయిన్ డెడ్ కావడానికి కారణమైన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దారుణానికి పాల్పడిన నిందితులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తప్పు చేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించరాదని, బాధితులకు న్యాయం జరిగేలా విచారణను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. అమరావతిలోని సచివాలయంలో శుక్రవారం ఈ ఘటనపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారులు ఆయనకు వివరించారు. నిందితులను ఇప్పటికే అదుపులోకి తీసుకున్నామని అధికారులు తెలియజేయగా, కేసు దర్యాప్తును వేగంగా పూర్తి చేసి కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

డాక్టర్ ప్రియాంక ఆరోగ్య పరిస్థితిపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. ఆమెకు అవసరమైన అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని, వైద్య బృందాలు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ ఘటనలో గాయపడిన మరో వైద్య విద్యార్థి ఉమేష్ ఆరోగ్య పరిస్థితిని కూడా అడిగి తెలుసుకున్నారు. రాజమహేంద్రవరంలోని ప్రసాద్ ఆదిత్య మాల్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. మద్యం మత్తులో ఉన్న ఇద్దరు యువకులు మాల్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించగా, భద్రతా సిబ్బంది బ్రీత్ ఎనలైజర్ పరీక్షలో మద్యం సేవించినట్లు గుర్తించి వారిని అనుమతించలేదు. దీంతో ఆగ్రహించిన యువకులు కారుతో వేగంగా బయటకు వెళ్లే క్రమంలో అక్కడ ఉన్న వైద్య విద్యార్థులపై దాడికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు.



జీఎస్ఎల్ మెడికల్ కాలేజీకి చెందిన పీజీ విద్యార్థులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ ఉమేష్ స్కూటీపై వెళ్తుండగా నిందితులు కారుతో పలుమార్లు ఢీకొట్టినట్లు విచారణలో తేలింది. ఈ ఘటనలో ప్రియాంక తీవ్రంగా గాయపడగా, ఉమేష్‌కు కూడా గాయాలయ్యాయి. అనంతరం బాధితులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రియాంకను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించినప్పటికీ, తీవ్ర తలగాయాల కారణంగా ఆమె బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు ప్రకటించారు. ఘటనపై పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. దాడి ఉద్దేశపూర్వకంగా జరిగిందన్న అనుమానాల నేపథ్యంలో మరింత కఠినమైన నేర అభియోగాలను చేర్చే అంశాన్ని పరిశీలిస్తున్నారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపగా, వైద్య వర్గాలు మరియు ప్రజల నుంచి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలన్న డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి.

# ప్రజలతో మమేకమైన హోంమంత్రి

అనకాపల్లి, ఆగస్టు 7 : అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం ఒడ్డిమెట్ట గ్రామంలో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ప్రజలతో ఆత్మీయంగా మమేకమయ్యారు. “రెండు ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం ఇంటింటి” కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించిన ఆమె ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. పర్యటన సందర్భంగా వినాయక, ఆంజనేయస్వామి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.




అనంతరం గ్రామ ప్రజలతో సమావేశమై వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రజలతో నేరుగా మాట్లాడి ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. గ్రామ మహిళలు, స్థానికులు చూపించిన ఆదరణ తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని అనిత తెలిపారు. గ్రామస్తులతో కలిసి కోలాటంలో పాల్గొని సందడి చేశారు. ప్రజల ప్రేమాభిమానాలు మరింత బాధ్యతను పెంచుతున్నాయని పేర్కొన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను ఈ సందర్భంగా ఆమె వెల్లడించారు. రూ.660 కోట్లకు పైగా సంక్షేమ కార్యక్రమాలు, రూ.500 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టి ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకొస్తున్నామని తెలిపారు. ప్రాంత అభివృద్ధికి కీలకంగా మారనున్న ఉక్కు కర్మాగారం ద్వారా వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చెప్పారు. యువతకు మెరుగైన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని వివరించారు. ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మరింత అభివృద్ధి, మరింత సంక్షేమం అందించేందుకు కృషి చేస్తానని హోంమంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యా వికాసానికి కొత్త బాట



ధర్మవరం, ఆగస్టు 7 : ధర్మవరం పట్టణంలోని సుందరయ్య నగర్‌లో గల శ్రీ గణేష్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని ‘విద్యా వాహిని’, ‘విద్యా వికాసం’ కార్యక్రమాలను ప్రారంభించారు. సంస్కృతి సేవా సమితి సహకారంతో ఎకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలను రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించారు. ‘విద్యా వాహిని’ కార్యక్రమం కింద 30 గ్రామ పంచాయతీలను దత్తత తీసుకుని అక్కడ చదువుతున్న విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు, సృజనాత్మక కార్యకలాపాలు, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నెలవారీ క్విజ్ పోటీలు, వివిధ ప్రతిభా కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ‘విద్యా వికాసం’ కార్యక్రమాన్ని 40 ఉన్నత పాఠశాలల్లో అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఆరవ తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల్లో తెలుగు, ఆంగ్లం, గణితంపై ఆసక్తి పెంచడంతో పాటు సృజనాత్మకత, వ్యక్తిగత అభ్యాస నైపుణ్యాలు, సంఖ్యా సామర్థ్యాలను అభివృద్ధి చేసేలా ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. విద్యార్థులలో చదువుపై ఆసక్తి పెంపొందించడంతో పాటు భవిష్యత్తు పోటీ ప్రపంచానికి సిద్ధం చేయడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని సత్యకుమార్ యాదవ్ అన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా నాణ్యమైన అవకాశాలు పొందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు.

# డీఎస్సీపై జగన్ విమర్శల వెల్లువ

- సీబీఐ విచారణకు ఎందుకు భయమని ప్రశ్న
- నిరుద్యోగుల నిరసనలపై దాడుల ఆరోపణ
- మూడు కీలక డిమాండ్లు చేసిన వైసీపీ అధినేత

తాడేపల్లి, ఆగస్టు 7 : డీఎస్సీ--2025 ప్రశ్నాపత్రం లీకేజీ, నియామకాల్లో అక్రమాల ఆరోపణలపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం చేస్తున్న నిరుద్యోగ యువతపై ప్రభుత్వం నిర్బంధ చర్యలకు దిగుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆరోపించారు. ఈ వ్యవహారంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కాపాడేందుకే ప్రభుత్వం ఇంత తీవ్రంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. డీఎస్సీ నియామకాల్లో ఎలాంటి అవకతవకలు జరగలేదని చెబుతున్న ప్రభుత్వం సీబీఐ విచారణకు ఎందుకు వెనుకాడుతోందని ప్రశ్నించారు. విడుదల చేసిన ప్రకటనలో జగన్ మాట్లాడుతూ, డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ కోరుతూ విజయవాడలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలపై అధికార పార్టీ నాయకులు దాడి చేశారని ఆరోపించారు. పోలీసుల సమక్షంలోనే శిబిరాలను ధ్వంసం చేసి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సహా నిరుద్యోగ యువతపై రాళ్లు, కోడిగుడ్లు, టమాటాలతో దాడులు జరిగాయని పేర్కొన్నారు. మహిళలపైనా దాడులకు పాల్పడ్డారని విమర్శించారు.

రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో నిరసన శిబిరాలపై నిర్బంధకాండ కొనసాగుతోందని జగన్ అన్నారు. చిలకలూరిపేట, కనిగిరి, యాడికి, తాడిపత్రి, పలమనేరు, రేపల్లె, గుంటూరు, పొన్నూరు, వేమూరు, మాచర్ల, గురజాల, కందుకూరు, బాపట్ల తదితర ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలను అడ్డుకోవడంతో పాటు నాయకులను అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు. శాంతియుతంగా ప్రశ్నించే హక్కును కూడా నిరుద్యోగులకు దూరం చేస్తున్నారని మండిపడ్డారు. డీఎస్సీ ప్రక్రియపై ప్రభుత్వం పారదర్శకత ఉందని చెబుతున్న నేపథ్యంలో



సీబీఐ విచారణకు అంగీకరించడంలో ఇబ్బంది ఏమిటని జగన్ ప్రశ్నించారు. నిజంగా ఎలాంటి అక్రమాలు జరగకపోతే స్వతంత్ర దర్యాప్తుకు ప్రభుత్వం ముందుకు రావాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జగన్ ప్రభుత్వం ముందు మూడు ప్రధాన డిమాండ్లు ఉంచారు. డీఎస్సీ నియామకాల వ్యవహారంలో నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలని, విద్యా దీవెన, వసతి దీవెన కింద పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.9,000 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగ యువతకు నెలకు రూ.3,000 చొప్పున నిరుద్యోగ భృతిని గత బకాయిలతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. దీక్షా శిబిరాలను ధ్వంసం చేయడం, అరెస్టులు చేయించడం ద్వారా వాస్తవాలను దాచలేరని జగన్ పేర్కొన్నారు. డీఎస్సీ వ్యవహారంలో నిజాలు వెలుగులోకి వచ్చే వరకు, నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# అనంతపురం జిల్లాలోని ప్రముఖ దేవాలయాలు/పర్యాటక ప్రదేశాలపై కస్టమిజడ్ మైస్టాంప్ విడుదలకు ప్రతిపాదన

## తపాలా శాఖ చొరవ జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్

అనంత కలెక్టరేట్, ఆగస్టు 07:( అనంత సూర్య ): అనంతపురం జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధి, ఆధ్యాత్మిక మరియు సాంస్కృతిక వారసత్వ పరిరక్షణతో పాటు జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తెచ్చే వివిధ అంశాలను దేశవ్యాప్తంగా మరియు అంతర్జాతీయ స్థాయిలో ప్రజలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో, భారత తపాలా శాఖ ఆధ్వర్యంలో కస్టమిజడ్ మైస్టాంప్ విడుదల చేయడానికి ప్రతిపాదన సిద్ధం చేసినట్లు అనంతపురం డివిజన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్ శ్రీ కె. అమర్‌నాథ్ తెలిపారు. ఈ సందర్భంగా అనంతపురం జిల్లా జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ని కె. అమర్‌నాథ్ అధికారికంగా కలిసి, అనంతపురం జిల్లాలోని ప్రముఖ దేవాలయాలు మరియు ముఖ్యమైన పర్యాటక ప్రదేశాలను (టెంపుల్స్ /టూరిజం ప్లేసెస్ ) ప్రతిబింబించే విధంగా కస్టమిజడ్ మైస్టాంప్ విడుదలకు సంబంధించిన ప్రతిపాదనను వివరించారు. అనంతపురం జిల్లాలోని 12 ప్రముఖ దేవాలయాలు/పర్యాటక ప్రదేశాలను ఎంపిక చేసి కస్టమిజడ్ మైస్టాంప్ లో పొందుపరచడం ద్వారా జిల్లాలోని ఆధ్యాత్మిక,



చారిత్రక, సాంస్కృతిక మరియు పర్యాటక వైభవాన్ని దేశవ్యాప్తంగా ప్రజలకు పరిచయం చేయడంతో పాటు అనంతపురం జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి మరింత ప్రోత్సాహం కల్పించవచ్చని జిల్లా కలెక్టర్ కి వివరించారు. దేవాలయాలు మరియు పర్యాటక ప్రదేశాలతో పాటు అనంతపురం జిల్లాకు ప్రత్యేక గుర్తింపునిచ్చే ఇతర ముఖ్యమైన అంశాలను కూడా కస్టమిజడ్ మైస్టాంప్ ద్వారా ప్రజలకు పరిచయం చేయాలనే ప్రతిపాదనలో భాగంగా అనంతపురం జిల్లాలో పండించే మిల్లెట్స్ (చిరుధాన్యాలు), హస్తకళలు, కళలు మరియు సాంస్కృతిక వారసత్వం, ప్రధాన ప్రజా సంక్షేమ కార్యక్రమాలు తదితర అంశాలను కూడా ప్రదర్శించే అవకాశాన్ని వివరించారు. జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసి అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇవ్వడం పట్ల తపాలా శాఖ తరపున శ్రీ కె. అమర్‌నాథ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ అధికారిక సమావేశంలో శ్రీ పి. ఉమామహేశ్వర, అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్ మరియు శ్రీ జె. రామ్ మోహన్ రెడ్డి, దీణవీజు, అనంతపురం డివిజన్ పాల్గొన్నారు.

# రెండేళ్లలో రాయలసీమ ప్రగతి వైసీపీ కనిపించడం లేదా

అనంతపురం, ఆగస్టు 7 అనంత సూర్య : రాయలసీమ ప్రాంతంలో వైసీపీ హయాంలో ఫ్యాక్షన్ జరిగితే.. రెండేళ్ల కూటమి పాలనలో ప్రగతి వైపు వెళ్తోందని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. 22వ డివిజన్ బుడ్డప్పనగర్‌లో ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమంలో కురుబ కార్పొరేషన్ చైర్మన్, అనంతపురం నియోజకవర్గ టిడిపి పరిశీలకుడు దేవేంద్రప్పతో కలిసి ఆయన పాల్గొన్నారు. రాజేంద్ర మున్సిపల్ స్కూల్ వద్ద ఎమ్మెల్యేకి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ఆయన కూటమి నాయకులతో ఇంటింటికీ వెళ్తూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సంక్షేమ పథకాలు, నగరంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి ఆరా తీశారు. ప్రజల నుంచి ఎమ్మెల్యే దగ్గుపాటికి మంచి స్పందన కనిపించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో విధ్వంసం జరిగితే..ఈ రెండేళ్లలోనే అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఒక్క అర్బన్ నియోజకవర్గంలోని రూ.1290కోట్లు ఖర్చు చేశామన్నారు. కేవలం రూ.200కోట్లు రోడ్లు, డ్రైన్ల



కోసమే ఖర్చు చేశామన్నారు. రెండేళ్లలో రూ.7కోట్లు సీఎంఆరఎఫ్ కింద సాయం చేసినట్టు తెలిపారు. 5ఏళ్ల వైసీపీ పాలనలో కోటి రూపాయలు కూడా ఇవ్వలేదన్నారు. జగన్ రెడ్డి 10లక్షలకోట్లు అప్పులు పెట్టి పోయినా.. రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టి ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నారన్నారు. ఇప్పటికే సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చడంతో పాటు లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చారన్నారు. రాయలసీమ ప్రాంతం గత వైసీపీ పాలనలో వెనుకబాటుకు గురైందన్నారు. హార్టీకల్చర్ హబ్ కోసం 40వేల కోట్లు కేటాయించారని.. పీపీపీ మోడల్లో 60వేల కోట్లు తెస్తున్నారన్నారు. రెండేళ్లలో ప్రఖ్యాత కంపెనీలు వేల కోట్ల పెట్టుబడులు పెట్టాయన్నారు. రాయలసీమ ప్రాంతం ఒక ప్రధాన పారిశ్రామిక హబ్‌గా మారుతోందన్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్, రాయల్ ఎన్‌ఫీల్డ్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, అదానీ గ్రూప్ వంటి ఎన్నో ప్రముఖ గ్లోబల్ మరియు జాతీయ కంపెనీలు భారీ పెట్టుబడులు పెడుతున్నాయన్నారు. సోలార్, విండ్ ప్లాంట్లు భారీగా వస్తున్నాయన్నారు. ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు మార్క్ అభివృద్ధి అని..రానున్న మూడేళ్లలో రాయలసీమ రూపురేఖలు మారుతాయని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, టిడిపి సీనియర్ నాయకుడు బుగ్గయ్య చౌదరి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి సంగా తేజస్విని, క్లస్టర్ ఇంచార్జ్ సాకే లక్ష్మీనరసింహ, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ రెడ్డి, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు తొండపునాటి రమేష్, డైరెక్టర్లు బొమ్మినేని శివ, పరమేశ్వర్, 22వ డివిజన్ నాయకులు పుల్లన్న, జైభున్ని, కట్టుబడి బాబాజీ, యమున, వంశీ టిడిపి నాయకులు రమాదేవి, సుజాతమ్మ, మారుతికుమార్ గౌడ్, సున్నం శ్రీనివాసులు కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారి విస్తరణ, సర్వీస్ రోడ్లు, లింక్ రోడ్లు, అండర్‌పాస్‌లపై తక్షణ చర్యలు తీసుకోండి

న్యూఢిల్లీ : ఆగస్టు 07 (అనంత సూర్య ) అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల రవాణా సౌకర్యాల మెరుగుదల, రోడ్డు భద్రత, పట్టణ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ వాల్మీకి కేంద్ర రహదారుల రవాణా మరియు జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ని కలిసి 3 కీలక వినతిపత్రాలను సమర్పించారు.అనంతపురం జిల్లా భవిష్యత్ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత కలిగిన జాతీయ రహదారి ప్రాజెక్టులను వేగవంతం చేయాలని, ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎంపీ కోరారు. హైదరాబాద్--బెంగళూరు జాతీయ రహదారి (ఎన్ హెచ్ -44) విస్తరణకు ప్రాధాన్యత ఇవ్వాలి: హైదరాబాద్--బెంగళూరు మధ్య ఉన్న ఎన్ హెచ్-44 దేశంలో అత్యంత రద్దీగా ఉండే జాతీయ రహదారులలో ఒకటని ఎంపీ పేర్కొన్నారు. ప్రస్తుతం నాలుగు లేన్లుగా ఉన్న ఈ మార్గం సామర్థ్యానికి మించి వాహన రాకపోకలు సాగుతున్నందున తరచూ ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వివరించారు.ఈ రహదారిని విస్తరించేందుకు గతంలో డీపీఆర్‌లు సిద్ధమైనప్పటికీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదని గుర్తుచేస్తూ, తక్షణమే పరిపాలనా, ఆర్థిక అనుమతులు మంజూరు చేసి ప్రాధాన్యత ఆధారంగా విస్తరణ పనులు ప్రారంభించాలని కోరారు.అలాగే గుత్తి - గుంతకల్లు జాతీయ రహదారి టెండర్ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసి పనులు ప్రారంభించమని కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని ఎంపీ కోరారు. అనంతపురం పట్టణంలో ఎన్ హెచ్-44పై సర్వీస్ రోడ్లు, వాహన అండర్‌పాస్‌లలో మార్పులు అవసరం : అనంతపురం



పట్టణ పరిధిలోని సాక్షి కార్యాలయం అండర్‌పాస్ నుంచి ప్రసన్నాయపల్లి అండర్‌పాస్ వరకు సుమారు 750 మీటర్ల మేర సర్వీస్ రోడ్డు లేకపోవడం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎంపీ తెలిపారు. ఈ కారణంగా ప్రధాన రహదారిని దాటాల్సి రావడంతో ప్రమాదాల ముప్పు పెరుగుతోందని వివరించారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతంలో సర్వీస్ రోడ్డును పూర్తి చేయాలని కోరారు.అదేవిధంగా ప్రసన్నాయపల్లి వద్ద ప్రతిపాదిత వాహన అండర్‌పాస్‌ను ప్రస్తుతం నిర్ణయించిన ప్రదేశం నుంచి ప్రధాన క్రాస్‌రోడ్డు సమీపానికి మార్చాలని సూచించారు. ఎన్ హెచ్-42 -- ఎన్ హెచ్-544డి మధ్య నేరుగా లింక్ రోడ్డు నిర్మాణం చేపట్టాలి: అనంతపురం నగర ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారంగా చీఎ-44, చీఎ-42, మరియు చీఎ-544ణలను అనుసంధానించే “తూర్పు బైపాస్” నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.ఈ బైపాస్‌ను అనంతపురం--తాడిపత్రి రహదారి నుంచి అనంతపురం--చెన్నై రహదారికి అనుసంధానించేలా ప్రతిపాదించారు.దీని ద్వారా పట్టణంలోకి వచ్చే సిమెంట్ లారీలు, ఇతర భారీ రవాణా వాహనాలను నగరానికి వెలుపలే మళ్లించడం సాధ్యమై, ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గడంతో పాటు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని తెలిపారు. అలాగే అనంతపురం నగర విస్తరణకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని పేర్కొంటూ, బైపాస్ నిర్మాణానికి అవసరమైన నిధులను త్వరితగతిన మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతపురం సమగ్ర అభివృద్ధే లక్ష్యం: అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు సురక్షితమైన, ఆధునిక రవాణా సదుపాయాలు అందించడమే తన ప్రధాన లక్ష్యమని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించి తక్షణ చర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ ప్రాజెక్టులు అమలైతే అనంతపురం నగర ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు ప్రజల ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడతాయని, పారిశ్రామిక, వాణిజ్య, ఆర్థిక అభివృద్ధికి కొత్త దిశ లభిస్తుందని ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ పేర్కొన్నారు.

# సంక్షేమ శాఖ వసతి గృహాలలో పిల్లలకు మెరుగైన సేవలు అందించాలి

## రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు పి, వెంకటప్ప

అనంతపురము, ఆగస్ట 07 ( అనంత సూర్య ) : అనంతపురం నగరంలోని స్థానిక ఆర్ అండ్ అతిథి గృహంలో సంక్షేమ శాఖ అధికారులతో నేటి శు



క్రవారం ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ తెగల కమిషన్ సభ్యులు పి.వెంకటప్ప సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా షెడ్యూల్ తెగల కమిషన్ సభ్యులు మాట్లాడుతూ వసతి గృహాల్లో పేద విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని ఆరా తీస్తూ, సంక్షేమ హాస్టల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు కృషి చేయాలని సంక్షేమ హాస్టల్లో ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు. కొన్ని శాఖల అధికారులు స్పందించడం లేదని, అలాంటి వారిపైన శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. అంబేద్కర్ గురుకులాలలో సీట్ల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని డిసిఓ దాదా పీర్ ను కోరడమైనది. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణి కుష్బూ కొఠారి, సాంఘిక సంక్షేమ శాఖ ఎస్ డబ్ల్యూ ఓ లు రామ్మోహన్ రాము నాయక్, మైనార్టీ సంక్షేమ శాఖ వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ ఆరోగ్య కేంద్రాల ఆకస్మిక తనిఖీ

అనంత కలెక్టరేట్ ఆగస్టు 07 (అనంత సూర్య ): నగరంలోని ఐదు అర్బన్ హెల్త్ సెంటర్లను జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. నాయక్ నగర్, మంగళ వారి కాలనీ,



రెండవ రోడ్డు, వినాయక నగర్, శ్రీనివాస్ నగర్ లలోని ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రాల్లో సమయపాలన,, పరిశుభ్రత, ఎలక్ట్రానిక్ రికార్డుల నిర్వహణ, ప్రజలకు సంతృప్తికర సేవలు అందే విధంగా తీసుకుంటున్న చర్యలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రో గులకు వైద్యులు, సిబ్బంది సేవలు సంతృప్తికర స్థాయిలో అందించాలని ఆయన కోరారు. రోగులు చికిత్సల అనంతరం ఆనందంగా వెళ్లే రీతిలో ప్రతి ఒక్కరు మానవత జోడించి వైద్య సేవలు అందించాలని ఉద్బోధించారు.ఆరోగ్య కేంద్రాల్లో లభించే సేవల పట్ల ప్రజల్లో సానుకూల దృక్పథం పెంపొందాలని ఆయన సూచించారు. ఏ రకమైన అలసత్వం గుర్తించినా, సేవల్లో ఆలస్యం జరిగినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

# అగ్గిపెట్టెలో ఇమిడే చేనేత చీర అద్భుతం

## శ్రీరామ పట్టాభిషేకం వరకు.. చీరపై సాక్షాత్తూ దైవకళ

పెనుకొండ, ఆగస్టు 07 (అనంత సూర్య ): ప్రతి చీర వెనుక ఓ నేతన్న కుటుంబం చెమట ఉంటుంది, కళాకారుడి ఆత్మగౌరవం ఉంటుంది. యంత్రాల వేగానికి ప్రపంచం పరుగులు తీస్తున్నా, చేతి మగ్గంపై రూపుదిద్దుకున్న వస్త్రానికి ఉన్న ప్రత్యేకత మాత్రం చెక్కుచెదరలేదు. ఎందుకంటే చేనేతలో యంత్రం చేయలేని మానవ స్పర్శ ఉంటుంది. కళాకారుడి ఆలోచన ఉంటుంది. తరతరాలుగా వస్తున్న నైపుణ్యం ఉంటుంది. అగ్గిపెట్టెలో ఇమిడే చీరప్రపంచాన్ని ఆశ్చర్యపరిచిన కళ.భారతీయ చేనేత కళాకారుల సృజనాత్మకతకు అగ్గిపెట్టెలో



ఇమిడిపోయేంత సన్నని చీరలు ఓ అద్భుత నిదర్శనం. అంతటి సన్నని నూలుతో, అత్యంత నైపుణ్యంతో చీరను నేయడం సాధారణ విషయం కాదు. అది చేతివేళ్ల మాయాజాలం. ఓర్పుకు పరీక్ష, కళాకారుడి ఏకాగ్రతకు ప్రతిరూపం. అగ్గిపెట్టెలో ఇమిడేంత చిన్నగా మడిచినా, విప్పితే అందమైన చీరగా మారే ఆ కళ భారతీయ చేనేత ప్రతిభను ప్రపంచానికి చాటి చెబుతోంది. రాయలసీమ కళా వైభవానికి ప్రతీకగా నిలిచే పట్టు చీరలకు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. చేనేత కళలో మరో ప్రత్యేక ఆకర్షణ దేవతామూర్తుల డిజైన్లు. శ్రీ వెంకటేశ్వర స్వామి, శ్రీ మహాలక్ష్మీదేవి, శ్రీకృష్ణుడు, శ్రీరామ పట్టాభిషేకం, సీతారాముల కల్యాణం, రాధాకృష్ణులు, దుర్గాదేవి వంటి దైవ రూపాలను పట్టు చీరలపై అత్యంత నైపుణ్యంతో నిలపడం విశేషం.ఈ నేపథ్యంలోనే నేతన్నకు అండగా కూటమి ప్రభుత్వం రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవితమ్మ నేతృత్వంలో చేనేత రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది. నేతన్నలకు ఆర్థిక భరోసా కల్పించడం, సంక్షేమ పథకాల ప్రయోజనాలను చేరవేయడం, చేనేత ఉత్పత్తులకు మార్కెట్ అవకాశాలను పెంచడం, మహిళా చేనేత కార్మికులను ప్రోత్సహించడం వంటి అంశాలపై దృష్టి సారిస్తోంది.

# ప్రతి అర్జీకి పరిష్కారం చూపండి



పుట్టపర్తి, ఆగస్టు 07: ( అనంత సూర్య ) ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించి, ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా ప్రతి అర్జీపై బాధ్యతాయుతంగా స్పందించాలని అధికారులకు పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి ఆదేశించారు. పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమంలో నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఎమ్మెల్యే అర్జీలను స్వీకరించారు. తాగునీరు, భూ సమస్యలు, పెన్షన్లు, రెవెన్యూ, విద్యుత్, రోడ్లు, సంక్షేమ పథకాలు తదితర అంశాలపై ప్రజలు తమ వినతులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, ప్రజల సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి అర్జీని సంబంధిత శాఖ అధికారులు పరిశీలించి నిర్ణీత గడువులో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా, జవాబుదారీతనంతో పని చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు మెరుగైన6 పాలన అందించడమే లక్ష్యంగా పనిచేస్తోందని, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎలాంటి సంకోచం లేకుండా తమను సంప్రదించవచ్చని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తెలిపారు. అనంతరం ప్రజల నుంచి సుమారు 12 అర్జీలు స్వీకరించారు. ఇందులో విద్యుత్ 6 ,రెవెన్యూ 5 పోలీస్ 1 అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ విజయ కుమార్,టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సామకోటి ఆదినారాయణ,కృష్ణారెడ్డి,మురళీధర్ రెడ్డి, గడ్డం రమణారెడ్డి ,సురేష్ ,అంబులెన్స్ రమేష్, వెంకటరెడ్డి ,బేకరి నాయుడు,దేవేంద్ర రెడ్డి ,కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# కదిరిలో 'ఒక నెల - ఒక్క నియోజకవర్గం నాలుగు పర్యటనలు' కార్యక్రమం



కదిరి,ఆగస్టు ,7:( అనంత సూర్య ) ప్రజా ఫిర్యాదుల సత్వర, సక్రమ పరిష్కారం కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఒక నెల -- ఒక్క నియోజకవర్గం -- నాలుగు పర్యటనలు" వ్యవస్థీకృత మొదట పర్యటన శుక్రవారం కదిరి ఆర్డీఓ కార్యాలయంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్, కదిరి ఆర్డీఓ మరియు కదిరి తహసీల్దార్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నేడు మొత్తం 76 అర్జీలు రాగా వాటిపై తగు చర్య తీసుకొని పరిష్కరించు నిమిత్తం సంబంధిత అధికారులకు జాయింట్ కలెక్టర్ ఎండార్స్ చేయడం జరిగింది. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ... ఈ ప్రత్యేక షెడ్యూల్ ప్రకారం ప్రతి శుక్రవారం అధికారుల బృందం నియోజకవర్గంలో పర్యటిస్తుందని వివరించారు. మొదటి వారం ప్రజల నుంచి నేరుగా అర్జీలు/ఫిర్యాదులు స్వీకరిస్తారు. రెండో, మూడో వారం స్వీకరించిన అర్జీల పరిష్కారం కోసం అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేస్తారు. నాల్గో వారం పరిష్కరించిన అర్జీల పత్రాలను అర్జిదారులకు అందజేస్తారు. ఇప్పటికే పుట్టపర్తి , ధర్మవరం నియోజకవర్గాలలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశామని, ఈ నెలంతా కదిరి నియోజకవర్గంలో సేవలు అందిస్తున్నామని జేసీ తెలిపారు. కావున కదిరి నియోజకవర్గ ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కదిరి ఎమ్మెల్యే మాట్లాడుతూ...లి జిల్లా యంత్రాంగమంతా ఒక నియోజకవర్గానికి కేటాయించబడి, ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించడమే కాకుండా, పరిష్కారమైన వివరాలను తిరిగి అర్జీదారులకే అందజేసే వినూత్న కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. చిరకాలంగా పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ తదితర సమస్యలను అధికారులే ప్రజల వద్దకు వచ్చి స్వీకరించి పరిష్కరించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రజాసేవలో పాల్గొంటున్న జిల్లా అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కదిరి ఆర్డిఓ కలవతి ,తహసీల్దార్ రెడ్డి శేఖర్ , వివిధ శాఖల మండల అధికారులు, గ్రామస్థులు, రైతులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# పూలకుంట గ్రామ సచివాలయం సందర్శించిన జిల్లా స్వర్ణ గ్రామ వార్డు అధికారి



అనంతపురం రూరల్, జులై 7 ( అనంత సూర్య ): పూలకుంట స్వర్ణ గ్రామం కార్యాలయమును జిల్లా స్వర్ణ గ్రామ-స్వర్ణ వార్డు అధికారి వారు సందర్శించి సిబ్బంది హాజరు మరియు సంబంధిత రికార్డులు తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు, సిబ్బంది సకాలంలో హాజరు నమోదు చేయాలని, ఇంచార్జీ తీసుకున్న సిబ్బంది నిర్ణీత పని దినాలలో ప్రజలకు ఖచ్చితంగా అందుబాటులో ఉండాలని ఆదేశింస్తూ ప్రభుత్వశీ చేపట్టిన సర్వేలను సకాలం లో పూర్తి చేసి, ప్రజల సమస్యలను సత్వరం పరిష్కారిస్తూ వారి నుంచి సానుకూల దృక్పథాన్ని పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల స్వర్ణ గ్రామ అధికారి గణేష్, పంచాయతీ అభివృద్ధి అధికారి సంతోష్ కుమార్ మరియు స్వర్ణ గ్రామ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



చిత్తూరు,ఆగస్టు 7(అనంత సూర్య ): భారతీయ సంస్కృతికి ప్రతీకగా నిలిచిన చేనేత కళను ముందుకు తీసుకెళ్తున్న చేనేత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) కే. మోహన్ కుమార్ తెలిపారు. 12వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చేనేత కళ తరం నుంచి తరానికి వారసత్వంగా సంక్రమిస్తూ భారతీయ సంస్కృతిని ప్రపంచానికి చాటుతోందని పేర్కొన్నారు. వ్యవసాయం తర్వాత అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్న రంగం చేనేతేనని చెప్పారు.

జిల్లాలో 1,223 మంది చేనేత కార్మికులు పింఛన్లు పొందుతున్నారని, 252 మంది నేతన్నలకు నేతన్న నేస్తం పథకం ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 249 హ్యాండ్లూమ్ మగ్గాలు, 2,897 పవర్‌లూమ్‌లు పనిచేస్తున్నాయని వెల్లడించారు. విద్యుత్ రాయితీలు, పింఛన్లు, వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం చేనేత కార్మికులకు అండగా నిలుస్తోందన్నారు. యువత వారానికి కనీసం ఒకరోజైనా చేనేత వస్త్రాలు ధరిస్తే చేనేత రంగానికి ఊతం లభిస్తుందని ఆయన సూచించారు. కార్యక్రమానికి ముందు ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శన స్టాళ్లను డీఆర్ఓ సందర్శించి పరిశీలించారు. అనంతరం పలువురు చేనేత కార్మికులను దుశ్శాలువలతో సత్కరించారు.

ఈ కార్యక్రమంలో చేనేత శాఖ అధికారులు, చేనేత కార్మికులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సమాచార వ్యాప్తి బలోపేతానికి పీఐబీ విజయవాడ ఐఎంపీసీసీ సమావేశం



విజయవాడ, ఆగస్టు 7 అనంత సూర్య : ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల సమాచారాన్ని ప్రజలకు వేగంగా చేరవేయడం, అవాస్తవ సమాచారాన్ని సమ-ర్థవంతంగా అడ్డుకోవడం, కేంద్ర ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) విజయవాడ ఆధ్వర్యంలో ఇంటర్ మీడియా పబ్లిసిటీ కోఆర్డినేషన్ కమిటీ (ఐఎంపీసీసీ) సమావేశం శు క్రవారం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన పీఐబీ విజయవాడ డైరెక్టర్ జి. సురేష్ కుమార్ మాట్లాడుతూ, కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన పీఐబీ, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, దూరదర్శన్, ఆకాశవాణి వంటి మీడియా విభాగాలు ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్ధవంతంగా తీసుకెళ్లేందుకు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో అన్ని శాఖలకు పూర్తి సహకారం అందిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల ప్రతినిధులు తమ శాఖల ముఖ్య కార్యక్రమాలు, విజయాలు, ప్రజా అవగాహన కార్యక్రమాల వివరాలను పంచుకున్నారు. తపాలా శాఖ, భారతీయ రైల్వేలు, ఎయిమ్స్, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ), ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ), ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కెవిఐసి), నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ (ఎన్ఎస్ఓ), స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, దూరదర్శన్, ఆకాశవాణి తదితర సంస్థల నుంచి 15 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. సమాచార ప్రసార వ్యూహాలను మరింత సమ-ర్థవంతంగా అమలు చేయడం, ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన పెంచడం, తప్పుడు ప్రచారాన్ని అడ్డుకునేందుకు పరస్పర సహకారంతో పనిచేయాలని సమావేశంలో ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. తమ తమ శాఖలు ఇటీవల చేపట్టిన ప్రచార కార్యక్రమాల వివరాలను కూడా సమావేశంలో వివరించారు..

# మస్కవంకపల్లి టీడీపీ కార్యకర్త వెంకటప్పకు ఘన నివాళి



పుట్టపర్తి, ఆగస్టు 7 అనంత సూర్య : శ్రీ సత్యసాయి జిల్లా నల్లమాడ మండలం మస్కవంకపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త పట్నం వెంకటప్ప (70) ప్రమాదవశాత్తు మృతి చెందారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఆదేశాల మేరకు హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, తెలుగుదేశం పార్టీ నాయకులు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో వెంకటప్ప మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, వెంకటప్ప పొలం పనుల నిమిత్తం కొత్త బావి వద్దకు వెళ్లిన సమయంలో కాలుజారి పడిపోయారు. వెంటనే కుటుంబ సభ్యులు నల్లమాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం వైద్యుల సూచన మేరకు తొలుత కదిరి, అనంతరం అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడు వెంకటప్పకు భార్య రమణమ్మ, ఇద్దరు కుమారులు ఈశ్వర్, శ్రీనాథ్ ఉన్నారు. చిన్న కుమారుడు శ్రీనాథ్ తెలుగుదేశం పార్టీ నాయకుడిగా, వార్డు సభ్యుడిగా సేవలందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎం. నారాయణస్వామి, మాజీ సర్పంచ్ బసెట్టి నాగభూషణం, ఈరే శ్రీనివాసులు, పట్నం జయప్ప, వలం కృష్ణయ్య, వలం ఈశ్వరయ్య, సీపీ చంద్ర, కొండ్రెడ్డి బయారెడ్డి, చంద్ర తదితరులు పాల్గొని వెంకటప్పకు నివాళులర్పించారు.

# చేనేతకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోంది: టీడీపీ నాయకులు



ధర్మవరం, ఆగస్టు 7 అనంత సూర్య : 12వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. కదిరి గేట్, గాంధీనగర్ సర్కిల్, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లోని చేనేత, మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలోని చేనేత వృత్తిదారులకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ధర్మవరంలో చేనేత క్లస్టర్ ఏర్పాటు ద్వారా సుమారు 10 వేల మంది చేనేత కార్మికులకు నైపుణ్య శిక్షణ, పనిముట్లపై సబ్సిడీ అందించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 50 ఏళ్లు దాటిన చేనేత కార్మికులకు నెలకు రూ.4 వేల పెన్షన్, చేనేత కుటుంబాలకు 200 యూనిట్లు, మరమగ్గాలున్న కుటుంబాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే "నేతన్నల సేవలో" పథకం ద్వారా 71,536 మంది చేనేత కార్మికులకు ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున మొత్తం రూ.179 కోట్ల ఆర్థిక సహాయం అందించడం స్వాగతించదగ్గ నిర-ణయమన్నారు. రాష్ట్రంలో హ్యాండ్లూమ్ పార్కులు, చేనేత మ్యూజియం, టెక్స్‌టైల్ రీసైక్లింగ్ యూనిట్ వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, చేనేత కార్మికులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వేదవ్యాస మహర్షి జయంతి
# అధికారికంగా నిర్వహించాలి


**ఎమ్మెల్యే దగ్గుపాటిని కోరిన జశ్వంత్ వ్యాస్**



***అనంతపురం, ఆగస్టు 7 అనంత సూర్య :*** శ్రీవేద వ్యాస మహర్షి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని మత్స్యకార సంక్షేమ సమితి జిల్లా అధ్యక్షులు జశ్వంత్ వ్యాస్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను కోరారు. శుక్రవారం ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసిన సమితి సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జశ్వంత్ వ్యాస్ మాట్లాడుతూ.. అర్బన్ నియోజకవర్గంలో అర్హులైన నిరుపేద బెస్తలకు నివాస స్థలాలు కల్పించి ప్రభుత్వం ద్వారా ఇళ్లు నిర్మించాలన్నారు. బెస్త కులస్తులు ఎక్కువగా ఉన్న డివిజన్లలో స్థానిక మున్సిపల్ ఎన్నికలలో అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సానుకూలంగా స్పందించారు. అనంతరం ఎమ్మెల్యేను పూలమాలతో సత్కరించారు. అదేవిధంగా ఇటీవల నూతన జిల్లా మత్స్యకార సంక్షేమ సమితి సభ్యులను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ బెస్త పవన్ కుమార్, మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర కార్యదర్శి నారాయణమూర్తి, నగర అధ్యక్షులు బెస్త అశోక్, మత్స్యకార సంక్షేమ సమితి జిల్లా గౌరవ సలహాదారులు, వరదాయపల్లి మాజీ సర్పంచ్ బెస్త రమణ, సలహాదారులు తుపాకుల శంకర్, జిల్లా ఇంచార్జి శివకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు బెస్త వెంకటేష్, బెస్త రామాంజనేయులు, దుర్గా ప్రసాద్, పవన్ కుమార్ తదితరులు పాల్గొనారు.

# రోడ్డుపైకి.. డ్రైనేజీ మురుగు

**రోగాలబారిన స్థానిక ప్రజలు**



**అనంతపురం, ఆగస్టు 7 అనంత సూర్య :** నగరంలోని మొదటిరోడ్డు దేవాంగ భవన్ ఎదురుగా గత రెండు సంవత్సరాలుగా డ్రైనేజీ, కాలువ పరిస్థితి దారుణంగా ఉంది. ఆ మురుగునీరంతా రోడ్లపైకి ప్రవహిస్తోంది. దీంతో అటుగా వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందే. అంతేకాకుండా దోమలకు నిలయంగా మారిందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తద్వారా రోగాలబారిన పడుతున్నామని వాపోయారు. డ్రైనేజీ గోడలు పూర్తిగా దెబ్బతినడంతో మురుగు నీరు బయటకు రావడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. స్కూలు పిల్లలు సైతం అదే మురుగు నీటిలో స్కూలుకు వెళ్లాల్సి వస్తోంది. ప్రస్తుతం సీజనల్ వ్యాధులతో ప్రజలు అనారోగ్యాలపాలవుతున్నారని, ఇలాంటి సమయంలో ఈ మురుగు నీటి వల్ల అంటువ్యాధులు ప్రజలే అవకాశం ఉందని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రజాప్రతి నిధులు అదిగో.. ఇదిగో.. అంటూ కాలయాపన చేస్తున్నారే కానీ, పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ స్పందించి డ్రైనేజీ సమస్య తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

# ప్రభుత్వ భూమి హాం ఫట్!

## నేతలు.. అధికారులు ములాఖత్ !

- చక్రం తిప్పిన ఓ వీఆర్ఏ..
- చేయూతనందించిన ఓ ప్రజాప్రతినిధి
- టచ్ చేస్తే.. వైసీపీ నేతే రియల్ ఎస్టేట్ వ్యాపారి
- ఇదీ కక్కలపల్లి గ్రామంలో భూ'మాయ'



***అనంతపురం, ఆగస్టు 7 అనంత సూర్య :***

సంపాదించాలి.. తెల్లారేసరికి కోటీశ్వరులు కావాలి. ధనమదనంలో పడి కొందరు విలేజ్ రెవెన్యూ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో చేతులు కలిపారు. గ్రామాల్లోని విలువైన ప్రభుత్వ భూములను అమ్మేయడమే పనిగా పెట్టుకున్నారు. అలాంటిదే అనంతపురం రూరల్ పరిధిలోని కక్కలపల్లి గ్రామంలో ఒకటి వెలుగులోకి వచ్చింది. **ఆ వివరాలను ఒకసారి పరిశీలిస్తే..**

సర్వే నెంబర్ 213 -26(ఏ), 27(ఏ)లో 1.20 ఎకరాల భూమి ఉంది. ఈ విలువైన ప్రభుత్వ భూమిపై కన్నేసిన ఓ వీఆర్ఏ.. ఏ అండతో వైసీపీకి చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారితో చేతులు కలిపి ఆ ప్రభుత్వ భూమిని ప్లాట్లుగా విభజించి అమ్మకాలు మొదలెట్టారు. ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న ఈ భూమిపై అక్రమంగా హక్కులు సృష్టించి కొనుగోలుదారులను తప్పుదోవ పట్టిస్తున్నారని తెలిసింది. అనధికారిక వెంచర్‌గా వెలసిన ఈ ప్రభుత్వ భూవికి.. పంచాయతీ కానీ, అహుడా కానీ ప్రభుత్వ భూమిగా పరిగణించి అప్రూ వల్ ఇవ్వలేదు. అయితే ఈ భూమికి లేఅవుట్ వేసే సమయంలో కూడా ఎలాంటి అడ్డు చెప్పకుండా ఉండేందుకు స్థానిక ఓ వీఆర్వోకు అక్షరాల రూ.8 లక్షలు ముట్టజెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. ఆ తర్వాత ఆ భూకబ్జా దారుడు పేదలకు ఇంటి పట్టా అంటూ.. ఎర వేసి రూ.లక్షలు భుజించినట్లు స్థానికుల ద్వారా తెలిసింది.




**రూ. 8 లక్షలు తీసుకున్న ఆ వీఆర్వో ఎవరు ? వైసీపీ ముసుగులో ఉన్న ఆ రియల్ వ్యాపారి ఎవరు ? అండగా నిలిచిన వీఆర్ఏ ఎవరు ? రియల్ వ్యాపారికి వెన్నుదన్నుగా ఉన్న ఆ ప్రజాప్రతినిధి ఎవరు ? అనేది మరో కథనంలో వివరాలు బహిర్గతం చేస్తామని 'అనంత సూర్య' దినపత్రిక తెలియజేస్తోంది.**

# ఎస్పీ ఆదేశాలతో జిల్లావ్యాప్తంగా తనిఖీలు

***అనంతపురం, ఆగస్టు 7 అనంత సూర్య :*** జిల్లాలో రహదారి ప్రమాదాలు నియంత్రించడమే ధ్యేయంగా లక్ష్యంగా జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాలతో శుక్రవారం సాయంత్రం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల సరిహద్దుల్లో పోలీసులు ఊహించని రీతిలో ముమ్మర వాహన తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు, అదే సమయంలో ప్రయాణికులకు సురక్షిత ప్రయాణంపై పలు సూచనలు చేశారు. టూ వీలర్ నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాల్సిందేనని, కార్లు నడిపేవారు తప్పక సీట్ బెల్ట్ పెట్టుకోవాలని స్పష్టం చేశారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం, పరిమితికి మించిన వేగంతో వెళ్లడం, డ్రైవింగ్ చేస్తూ ఫోన్ మాట్లాడటం లాంటి ప్రాణాంతక అలవాట్లను సహించేది లేదని తేల్చి చెప్పారు. చట్టాన్ని అతిక్రమించి నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఘాటుగా హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణతో రోడ్డు నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాలకు అడ్డుకట్ట వేయగలం. ప్రజల ప్రాణరక్షణ కోసమే ఈ నిరంతర తనిఖీలు. ప్రతి పౌరుడూ బాధ్యతాయుతంగా వ్యవహరించి సురక్షిత సమాజ నిర్మాణంలో పోలీసులకు సహకరించాలని ఆయా పోలీసులు విజ్ఞప్తి చేశారు.






- వైసీపీ రిలే దీక్షలపై అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆగ్రహం
- అర్బన్ టీడీపీ కార్యాలయంలో 53వ ప్రజా దర్బార్ కార్యక్రమం
- ప్రజలతో ఓపిగ్గా మాట్లాడి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే దగ్గుపాటి
- మీ దీక్షల్లో కనీసం 10 మంది నిరుద్యోగులు, విద్యార్థులను చూపించాలని సవాల్

# పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లుంది వైసీపీ తీరు

***అనంతపురం, ఆగస్టు 7 అనంతసూర్య :***

వైసీపీ నేతల వ్యవహార తీరు.. పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్టుందని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఎద్దేవా చేశారు. అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఆయన 53వ ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలతో ఓపిగ్గా మాట్లాడి అర్జీలు స్వీకరించారు. కొన్ని సమస్యలకు సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ పరిష్కారం చూపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 52 ప్రజా దర్బార్ కార్యక్రమాల్లో 1246 అర్జీలు వస్తే.. 96మినహా అన్నింటికీ పరిష్కారం చూపించామన్నారు. వైసీపీ చేసిన పాపానికి టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారికి కూడా తగిన పరిష్కారం చూపిస్తున్నామని తెలిపారు. అలాగే 6వేల మందికి ఇళ్ల నిర్మాణాలు చేస్తామని ఆలమూరు, కొడిమి, ఉప్పరపల్లి ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టారన్నారు. అయితే వాటిలో ఒక్కటి కూడా పూర్తి చేయకుండా డబ్బు కాజేశారని ఆరోపించారు. ఇప్పుడు ఆ లబ్ధిదారులు కొత్త ఇళ్ల నిర్మాణాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం లేదని.. ఆ ఇళ్లు కూడా రాలేదన్నారు. అందుకే వాటి కూడా పరిష్కారం చూపిస్తున్నామన్నారు. మరోవైపు ప్రభుత్వం పై విమర్శలు చేసేందుకు ఏమీ లేక మెగా డీఎస్సీ అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారన్నారు. ఢిల్లీలో విద్యార్థులు ఆందోళన చేస్తే వారిని చూసి ఇక్కడ వైసీపీ నాయకులు బయటకొచ్చారన్నారు. అక్రమాలపై ఆధారాలు చూపాలని మంత్రి నారా లోకేష్ సవాల్ విసిరితే.. ఒక్కరు కూడా ముందుకు రారన్నారు. పైగా రోజుకో కార్యక్రమం చేస్తూ ఇప్పటికే ఉద్యోగాలు సాధించిన వారిని అవమానిస్తున్నారన్నారు. ప్రస్తుతం వారు చేస్తున్న రిలే దీక్షల్లో కనీసం 10మంది నిరుద్యోగులు, విద్యార్థులను చూపించాలని సవాల్ విసరారు. అక్కడ ఉన్నదంతా రాజకీయ నిరుద్యోగులు, రేపు రాజకీయంగా పదవులు కావాలనుకునే వారు, రౌడీషీటర్లేనంటూ దగ్గుపాటి విమర్శలు చేశారు.. ప్రభుత్వంపై బురద జల్లేందుకు 16వేల మంది జీవితాల్ని ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.




వైసీపీ తీరుకు వ్యతిరేకంగా 16 వేల మంది కర్నూలులో నిరసన తెలియజేస్తున్నారన్నారు. వైసీపీ ఇప్పటికైనా పద్ధతి మార్చుకోకుండా ఇలాగే వ్యవహరిస్తే ఆ 11 సీట్లు కూడా ఉండ వని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో కురుబ కార్పొరేషన్ చైర్మన్, అనంతపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అబ్జర్వర్ దేవేంద్రప్ప, టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, కార్పొరేషన్ డైరెక్టర్లు రంగాచారి, పిఎల్ఎన్ మూర్తి, కడియాల కొండన్న, బెస్త పవన్ కుమార్, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రంలో రెండేళ్లుగా.. నారాసుర పాలన

***అనంతపురం, ఆగస్టు 7 అనంతసూర్య :***

- సమస్యలపై ఉద్యమిస్తున్న యువతను గంజాయి బ్యాచ్ అంటారా ?
- మా ఉద్యమాన్ని జనం పట్టించుకోకపోతే మీకెందుకు ఉలికిపాటు?
- డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరగకపోతే విచారణకు ఎందుకు భయం?
- వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత
- రెండో రోజు రిలే నిరాహార దీక్షలు

రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చాక ప్రజాపాలన కాకుండా నారాసుర పాలన సాగుతోందని వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మండిపడ్డారు. ప్రశ్నించే గొంతులను అణగదొక్కడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నారని.. అక్రమ కేసులు, అరెస్టులకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ భయపడదని స్పష్టం చేశారు. డీఎస్సీ-2025 నియామకాల్లో జరిగిన అక్రమాలపై సీబీఐ విచారణకు ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. మెగా డీఎస్సీ పేరుతో దగా డీఎస్సీ నిర్వహించి నిరుద్యోగుల జీవితాలతో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌లు చెలగాటం ఆడారని మండిపడ్డారు. విద్యార్థి, నిరుద్యోగుల సమస్యలతో పాటు డీఎస్సీ అక్రమాలపై వైసీపీ జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ సమన్వయకర్త అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ప్రారంభమైన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం రెండో రోజుకు చేరుకున్నాయి. శిబిరంలో వైసీపీ మహిళా విభాగం, విద్యార్థి విభాగం, సాంస్కృతిక, వాలంటీర్స్, వాణిజ్య, గ్రీవెన్స్, పంచాయతీ రాజ్, దివ్యాంగుల, ఇంటెలెక్చువల్ విభాగాలతో పాటు నగరంలోని 14వ నుంచి 23వ డివిజన్ల నేతలు, ఎ.నారాయణపురం పంచాయతీ నాయకులు కూర్చున్నారు. దీక్షా శిబిరం వద్ద నల్ల బెలూన్లు ఎగురవేసి అనంత వెంకటరామిరెడ్డి రిలే దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీఎస్సీ అక్రమాలతో పాటు నిరుద్యోగ భృతి, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.9500 కోట్లు చెల్లించాలన్న డిమాండ్‌తో రాష్ట్ర వ్యాప్తంగా రిలే దీక్షలు చేస్తుంటే ప్రభుత్వం ఉలిక్కిపడుతోందని చెప్పారు. శాంతియుతంగా నిరసనలు తెలుపుతుంటే విజయవాడ, గుంటూరు, కనిగిరి, రేపల్లె వంటి ప్రాంతాల్లో అధికార నేతలు దౌర్జన్యాలకు దిగుతున్నారని తెలిపారు. ఈ ప్రభుత్వంలో ప్రశ్నించడమే నేరం అనే విధంగా అరెస్టులు, అక్రమ కేసులు పెడుతున్నారని, ఇలాంటి వాటికి వైఎస్ఆర్ పార్టీ ఎప్పుడూ భయపడదని చెప్పారు. డీఎస్సీ నియామకాల్లో అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘించి అర్హులకు అన్యాయం చేశారని విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తున్న యువతను ఉద్దేశించి గంజాయి బ్యాచ్.. 2 నిమిషాల్లో ఉద్యమాన్ని అణచివేస్తాం అంటూ సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించడాన్ని తీవ్రంగా ఖండించారు. అంటే రాష్ట్రంలో విచ్చలవిడిగా గంజాయి దొరుకుతోందని చంద్రబాబు అంటున్నారా? అని ప్రశ్నించారు. అధికార, పోలీస్ బలంతో తమ ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. తాము ఉద్యమాన్ని ప్రజలు పట్టించుకోవడం లేదని కొంత మంది ఎమ్మెల్యేలు చెబుతున్నారని.. మరి జనం పట్టించుకోకపోతే మీరెందుకు ఉలిక్కిపడుతున్నారని చురకలంటించారు. డీఎస్సీ వ్యవహారంలో ప్రభుత్వం తప్పు చేసింది కాబట్టే తమ ఉద్యమాన్ని చులకన చేసేలా మాట్లాడుతున్నారని తెలిపారు. అధికార పార్టీ నేతలు చెప్పినట్లు పోలీసులు నడుచుకోవద్దని కోరారు. అక్రమ అరెస్టులు, కేసులు పెడితే తిరుగుబాటు వస్తుందని హెచ్చరించారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405